క్లుప్తంగా

వంద ఫీట్ల రోడ్డుకు మార్కింగ్


మార్కింగ్ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పాతమంచిర్యాల నుంచి ఆండాళమ్మ కాలనీ వరకు వంద ఫీట్ల రోడ్డు వెడల్పు పనులకు గాను కార్పొరేషన్ అధికారులు మంగళవారం మార్కింగ్ చేశారు. గతంలోనే 100 ఫీట్ల రోడ్డును నిర్ణయిస్తూ, అప్పటి మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసింది. ఇటీవల రోడ్డును 108ఫీట్ల వెడల్పు చేయాలని అధికారులు నిర్ణయించగా, స్థానికుల నుంచి వచ్చిన అభ్యంతరాల మేరకు గతంలో మున్సిపల్ పాలకవర్గం నిర్ణయించినట్లుగా 100ఫీట్లకు పాత మంచిర్యాల నుంచి ఆండాళమ్మ కాలనీ వరకు రోడ్డుకు మార్కింగ్ చేస్తున్నారు.

‘నిధుల కోత సరికాదు’

జన్నారం: ఉపాధి హామీ పథకానికి కేంద్రం ప్రభుత్వం నిధుల కోత విధించడం సరికాదని సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కనికరపు అశోక్, నాయకులు లింగన్న, బుచ్చన్న, దాసండ్లా రాజన్న, అంబటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ముందే వేతనాలు ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఎలక్ట్రీషియన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని, సెప్టెంబర్ నెల జీతాన్ని పండుగకు ముందుగానే ఇవ్వాలని కోరుతూ మంగళవారం కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలు విన్నవించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు హరికృష్ణ, నస్పూర్ అధ్యక్షుడు వెంకటి, అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంకుమార్, మంచిర్యాల టౌన్ ఇంచార్జి లింగయ్య, శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

వారోత్సవాలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రామడుగు లక్ష్మణ్

పాతమంచిర్యాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నాయకులతో సమావేశమై మాట్లాడారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు గ్రామ, పట్టణ, మండల కేంద్రాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 17న ముగింపు సభ హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ, ప్రజాసంఘాల నేతలు హాజరు కావాలని కోరారు.నాయకులు జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, ఖలిందర్ అలీఖాన్, లింగం రవి, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, చాడ మహేందర్‌రెడ్డి, కుంచాల శంకరయ్య, కాదండి సాంబయ్య, పూజారి రామన్న పాల్గొన్నారు.

పనులు పూర్తి.. ప్రారంభం మరిచి

- రూ.1.28కోట్లతో మోడల్ హాస్టల్ భవన నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- వసతి లేకపోవడంతో విద్యార్థినులకు ఇబ్బందులు


లింగాపూర్ మోడల్ హాస్టల్ భవనం

దండేపల్లి: పాలకులు మారినా, ప్రభుత్వాలు మారిన దండేపల్లి మండలంలోని లింగాపూర్ మోడల్ హాస్టల్ భవనం కథ కంచికే అన్న చందంగా తయారయ్యింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మోడల్ హాస్టల్ నిర్మాణానికి రూ.1.28కోట్లు నిధులు మంజూరు చేసింది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా హాస్టల్ భవనం గురించి పెద్దగా పట్టించుకోలేదు. దీంతో మోడల్ స్కూల్ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ఐదేళ్లక్రితం పనులు పూర్తయినా, హాస్టల్ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ఏళ్లుగా సాగిన నిర్మాణం..
2013లో నిర్మాణ పనులు ప్రారంభించారు. 2020లో భవన నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రారంభించడంలో మాత్రం తీవ్ర జాప్యం నెలకొంది. పనులు పూర్తయి ఏళ్లు గడిచినా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. మోడల్ స్కూళ్లో చేరితే హాస్టల్ వసతి ఉంటుందని ఆశపడిన విద్యార్థులకు చివరకు నిరాశే మిగులుతోంది.

వందమందికి సౌకర్యం..
హాస్టల్లో కనీసం వంద మంది విద్యార్థినులకు మాత్రమే అవకాశం ఉంటుంది. అందులో ఇంటర్మీడియెట్‌కు మొదటి ప్రాధాన్యం, ఆ తర్వాత పదో తరగతి అవకాశం ఉంటుంది. అప్పటికీ వంద మంది నిండక పోతే కింది తరగతుల వరకు అవకాశం కల్పిస్తారు. కానీ హాస్టల్ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో చాలామంది విద్యార్థులు ఇళ్ల నుంచి ఆటోలు, బస్సుల్లో కాలేజీకి వస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రయాణ భారంతో పాటు, సమయం వృథా అవుతోంది. అదే హాస్టల్లో ఉంటే తమకు ఇబ్బందులు ఉండవని పలువురు విద్యార్థినులు పేర్కొంటున్నారు. హాస్టల్ వసతి లేకపోవడంతో అడ్మిషన్లపై ప్రభావం పడుతోంది.

ప్రారంభానికి ముందే శిథిలం

హాస్టల్ భవనం నిర్మాణం పనులు నత్తనడక, నాసిరకంగా చేపట్టడంతో భవనం ప్రారంభానికి ముందే శిథిలం అవుతోంది. భవనం కిటికీ అద్దాలు పగిలిపోయాయి. ఫ్యాన్లు, లైట్లు చోరీకి గురైనట్లు సమాచారం. దీంతో భవనం నిరుపయోగంగా మారింది. మళ్లీ మరమ్మతు చేయిస్తే తప్పా భవనం వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టిసారించి హాస్టల్ భవనాన్ని త్వరగా ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. నిధులు మంజూరవగానే మరమ్మతులు పూర్తిచేసి హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం.

– బషీర్, ఈడబ్ల్యూడీ ఏఈఈ

విద్యారంగం అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ కుమార్‌దీపక్


కాజిపల్లి పాఠశాలలో విద్యార్థిని ప్రశ్నిస్తున్న కలెక్టర్

భీమారం: విద్యారంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మండలంలోని కాజిపల్లి, దాంపూర్, భీమారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పాఠశాలలకు మరమ్మతు చేయించి, నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వం విద్యాబోధన చేయిస్తుందన్నారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. దాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. కాజిపల్లి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో వంటశాలలను పరిశీలించారు. అనంతరం ఆరో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి, అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించి విద్యనందిస్తున్నట్లు, విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలతో పాటు కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఇంటర్మీడియట్ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దాంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకుంటే బిల్లుల చెల్లింపులు సులభతరం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌రెడ్డితో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ
మంచిర్యాలరూరల్(హాజీపూర్): సెప్టెంబర్ 19, 20, 21తేదీల్లో హైదరాబాద్‌లోని ఓం కన్వెన్షన్ హాల్లో జరగనున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోకు సంబంధించి ప్రచార పోస్టర్లను మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పాసు రాము, ప్రధాన కార్యదర్శి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, జిల్లాలోని పలు మండలాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- డీఈవో యాదయ్య


రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

కాసిపేట: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి ప్రాథమిక, మోడల్‌స్కూల్ హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేశారు. హాస్టల్‌కు సంబంధించిన వివరాలు, సమస్యలను, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఏఎస్ఎం పోస్టు ఇచ్చినప్పటికీ జాయిన్‌కాకపోవడంతో ఆ పోస్టును త్వరలో మరొకరితో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నాణ్యమైన భోజనం అందించాలని, ఏమైనా లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం
మంచిర్యాలఅర్బన్: తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థి భవిష్యత్ తీర్చిదిద్దే సామర్థ్యం ఉపాధ్యాయునికి మాత్రమే ఉంటుందని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా సైన్స్ సెంటర్‌లో సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం మంచిర్యాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉత్తమ టీచర్లను సన్మానించారు. ఎంఈవో మాళవీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి’


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన నడిపెల్లి దివాకర్‌రావు 20ఏళ్లలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని, హిందుత్వం కోసం ఆయన ఏం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసేముందు మాజీ ఎమ్మెల్యే ఆలోచించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు, ఆయన కుమారుడు విజిత్‌రావులు తమ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలని, వినాయక నిమజ్జనం రోజున హిందూ ఉత్సవ సమితి వేదికపై మాజీ ఎమ్మెల్యే అసందర్భంగా మాట్లాడి, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మతకలహాలకు దారితీసేలా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే మాటలతో అల్లర్లు జరిగే అవకాశం ఉండడంతోనే, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ మైకును తీసుకున్నారని, ఇది ప్రజలందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురం రాజేశం, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రావుల అనిల్, పట్టణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు వెంకటసాయి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: మేడ్చల్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు సురేష్‌పై జరిగిన దాడికి నిరసనగా మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు బెల్లంపల్లి విద్యుత్ శాఖ డీఈ రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి శివారు 33/11కేవీ శివాలయం సబ్‌స్టేషన్లో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కారణంగా శివాలయం ఫీడర్, బాబు క్యాంపు ఫీడర్ పరిధిలో, బెల్లంపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ విని యోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

11న జాబ్‌మేళా
పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హెటిరో సంస్థలో 40జూనియర్ ఆఫీసర్ (స్త్రీలు, పురుషులు)100జూనియర్ కెమిస్ట్(ట్రైనీ) పురుషులు, 60జూనియర్ ఇంజనీర్(పురుషులు) పోస్టుల కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు 18–25వయస్సు కలవారై ఉండాలన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఉదయం 10–30 గంటలకు విద్యార్హత సర్టిఫికెట్లు, బయోటేటా ఫామ్‌తో హాజరుకావాలన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు
చెన్నూర్‌రూరల్: మండలంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ పనిముట్లు 40శాతం సబ్సిడీతో 382యూనిట్లు మంజూరయ్యాయని ఏవో యామిని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 13లోగా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో చెన్నూర్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రక్తదానానికి ముందుకు రావాలి
పాతమంచిర్యాల: రక్తదానానికి దాతలు ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం ఇంచార్జి మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, విద్యా సంస్థల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యోగా, మెడిటేషన్ సంస్థల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

యూజీ గనుల్లో ఉత్పత్తి ఖర్చు తగ్గాలి

- జీఎం శ్రీనివాస్


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆర్కే 5 గనిపై మంగళవారం ఈఅండ్ఎం సూపర్‌వైజర్లకు, మైనింగ్ స్టాఫ్‌కు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం గనికి నిర్దేశించిన 2.7లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నూరు శాతం సాధించాలన్నారు. ఉత్పత్తితో పాటు రక్షణ కూడా ఎంతో కీలకమన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించుకొంటేనే భూగర్భగనులను మరింత కాలం కొనసాగించవచ్చన్నారు. ఇటీవల చాలామంది యువ ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, ఈ వైఖరి మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గని మేనేజర్ సుధీర్ కుమార్ జా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘కాళోజీ ఉద్యమాల ప్రతిధ్వని’
శ్రీరాంపూర్: ప్రజాకవి కాళోజీ నారాయణ ఉద్యమాల ప్రతిధ్వని అని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. కాళోజీ జయంతిని సింగరేణి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏరి యా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఫిట్ సెక్రెటరీ సందీప్, అధికారుల సంఘం నాయకులు దేవేందర్ రెడ్డి, డీజీఎంలు అనిల్ కుమార్(పర్సనల్), ఆనంద్(సివిల్) తదితరులు ఉన్నారు.

స్టడీటూర్‌లో ఓసీపీ సందర్శన

శ్రీరాంపూర్: కంపెనీ ఏర్పాటు చేసిన స్టడీ టూర్‌కు వెళ్లిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మంగళవారం కోలిండియాలోని మహానదీ కోల్‌ఫీల్డ్స్ ఓసీపీ గనిని సందర్శించారు. ఒరిస్సాలోని సమలేశ్వరీ ఓపెన్‌కాస్టు గనిని సందర్శించారు. అక్కడి అధికారులు గని బొగ్గు ఉత్పత్తి ఖర్చును, బొగ్గుబ్లాక్‌ను ఏ విధంగా ఆక్షన్‌లో దక్కించుకున్నారో వివరించారు. కోల్ మార్కెట్ విధానం, క్వాలిటీ ప్రమాణాలను అడిగి తెలుసుకున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శులు షేక్ బాజీసైదా, రమేశ్, రాంగోపాల్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ కోర్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఎస్‌ఓటుజీఎం విజయ్‌ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం కోర్సులు నేర్చుకున్న వారికి పరీక్షలు నిర్వహించగా 344మంది రాశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సీనియర్ పీవో బొంగోని శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

11న ‘చలో కొత్తగూడెం’

శ్రీరాంపూర్: ఈ నెల 11న ‘చలో కొత్తగూడెం’ కార్యక్రమం చేపట్టినట్లు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో 15శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్‌ను ముట్టడించబోతున్నట్లు తెలిపారు. దీనికి పెద్దయెత్తున కాంట్రాక్ట్ కార్మికులు తరలిరావాలని కోరారు. వాటా సాధన కోసం ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఎస్టీపీపీలో కాళోజీ జయంతి


నివాళులర్పిస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటులో మంగళవారం తెలంగాణ కవి, పద్మవిభూషణ్ డాక్టర్ కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ పర్వయ్య, సీఎంవోఏఐ బ్రాంచ్ సెక్రెటరీ సంతోశ్‌కుమార్, ఏజీఎంలు మదన్‌మోహన్, శ్రీనివాస్, డీజీఎంలు అజాజుల్లాఖాన్, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిరూరల్: పూలమాల వేస్తున్న జీఎం


బెల్లంపల్లి సీవోఈ కళాశాలలో...


మంచిర్యాలటౌన్: నివాళులర్పిస్తున్న కమిషనర్

ఘనంగా కాళోజీ జయంతి

బెల్లంపల్లి/భీమిని/చెన్నూర్‌రూరల్/దండేపల్లి/మందమర్రిరూరల్/మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠనం, ఉపన్యాస, కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలంగాణ పాటలు, నాటికలు నృత్య ప్రదర్శన ఏకపాత్రాభినయం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి రక్తి కట్టించారు. కాళోజీరరాయణ రావు కవిత రచనల ప్రాధాన్యతను ప్రజల భాషను గుర్తు చేశారు. జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో డీటీవో సంతోశ్, గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ పి.వెంకటరాములు వేర్వేరుగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో కార్పొరేషన్ కమిషనర్ సంపత్‌కుమార్, టీపీవో సంపత్‌కుమార్, ఈఏ మధు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగశర్మ, మందమర్రిలో ఏరియా జీఎం రాధాకృష్ణ, దండేపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాల, వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంగర్స్ రాజేశ్వర్ రావు, బొలిశెట్టి రాజన్న, బెల్లంపల్లి సీవోఈ కళాశాల ఆకిడి విజయ్‌సాగర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బెటాలియన్‌లో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు


దండేపల్లిలో...


సుద్దాల జెడ్పీఎస్ఎస్‌లో...


మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

క్రైం కార్నర్..

● ఇసుక ట్రాక్టర్లు పట్టివేత
భీమిని/బెల్లంపల్లిరూరల్: కన్నెపెల్లి మండలంలోని జజ్జరవెల్లి వాగు నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై భాస్కర్‌రావు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల సమీపంలోని వాగుల్లో నుంచి మంగళవారం బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మైనింగ్ శాఖ సిబ్బంది సురేష్, రామ్ నరేష్‌లు పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు.

ఫ్లెక్సీ వివాదం.. పోలీస్‌స్టేషన్ ముందే ఉద్రిక్తత
శ్రీరాంపూర్: సీసీసీ కార్నర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీ వివాదం రెండు పార్టీల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. కార్నర్‌లోని ఓ హోటల్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు ఫ్లెక్సీల విషయంలో గొడవపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు బేర సత్యనారాయణ వర్గీయులకు, కాంగ్రెస్ నాయకుడు ధర్ని మధు వర్గీయులకు మధ్య ఈ గొడవ జరిగిందని తెలిసింది. దీనిపై పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై ఉపేందర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. తర్వాత తమ ఫ్లెక్సీని కాంగ్రెస్ నేతలు చింపారంటూ బీఆర్ఎస్ నాయకులు సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. వారు వచ్చిన కొద్ది సేపటికి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో స్టేషన్ వద్ద ఇరువర్గాలు ఎదురుపడటంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి ఒక వర్గంపై మరో వర్గంపై దాడి చేసింది. రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు ఈ గొడవకు దిగడంతో స్టేషన్ ముందే ఉద్రిక్తతలు తలెత్తాయి. రాత్రివేళ స్టేషన్ వద్దే ఈ ఉద్రిక్తతలు తలెత్తడంతో వెంటనే మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్‌లు వచ్చి ఇరువర్గాలను కట్టడి చేశారు.

● ముగ్గురి బైండోవర్
దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి శివారులో గల 444సర్వే నంబర్‌లోని ఎకరం ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు చదును చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశారు. ఆ వ్యక్తులపై చర్యల్లో భాగంగా డీటీ మాధవి ఆదేశాల మేరకు ఆక్రమణకు ప్రయత్నించిన దమ్మ సునీల్, మన్నె రవి, బండ ప్రసాద్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మంగళవారం దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

● బెల్ట్‌షాపుల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీ
బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 21వార్డు బూడిదగడ్డ బస్తీలో అక్రమంగా నిర్వహిస్తున్న మూడు బెల్ట్‌షాపులను మంగళవారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. పదుల సంఖ్యలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు సమాచారం.